క్లుప్తంగా

ఎరువులు, పురుగు మందుల షాపుల్లో తనిఖీలు



నల్లజర్లలోని ఎరువుల షాపు తనిఖీ చేస్తున్న కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు

నల్లజర్ల: ఇంటర్నల్ స్క్వాడ్ తనిఖీల్లో భాగంగా కోరుకొండ ఏడీఏ బీకే మల్లికార్జునరావు మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల షాపుల్లో మంగళవారం తనిఖీలు చేశారు. కలెక్టర్ మాధవీలత ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. గోదాములలో ఎరువుల నిల్వలు, బిల్లులు, స్టాకు రిజిస్టర్లు, ఈ–పాస్ నిల్వలను పరిశీలించారు. లైసెన్సులలో ఉన్న తేడాలను సరి చేసుకోవాలని డీలర్లకు ఆయన సూచించారు. ఆయన వెంట ఏఓ కమల్‌రాజ్, వీఏఏలు పామర్తి దుర్గా సురేష్, కె.ప్రభాకర్ ఉన్నారు. మండలంలోని మొత్తం 11 ఎరువులు షాపుల్లో ఆయన తనిఖీలు చేశారు.

రైతులకు రూ.36 లక్షల రుణాలు



పాడి రైతులకు రుణం అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు

నిడదవోలు రూరల్: రైతులను రుణాలు ఇచ్చి, వారు ఆర్థికంగా స్థిరపడేలా ప్రోత్సహిస్తున్నామని శంకరాపురం సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు అన్నారు. శంకరాపురం సొసైటీ ఆధ్వర్యంలో 21 మంది రైతులకు రూ.36 లక్షల దీర్ఘకాలిక రుణాలను మంగళవారం రామారావు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడి సహకారంతో పాడి రైతులు గేదెల కొనుగోలుకు, వ్యవసాయ భూముల అభివృద్ధికి రుణాలు అందిస్తున్నామన్నారు. సొసైటీ కార్యదర్శి పి.ప్రకాశరావు, రైతులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన నలుగురిపై కేసు

నిడదవోలు రూరల్: ఆస్తి తగాదా నేపథ్యంలో దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఏఎస్సై పరమహంస మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని కలవచర్లకి చెందిన కారింకి సత్యనారాయణకు అతడి బంధువైన మారిశెట్టి రాముడికి కొంతకాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 16న సత్యనారాయణతో పాటు అతని సోదరుడు వెంకటేష్‌పై మారిశెట్టి రాముడితో పాటు అతని కుటుంబ సభ్యులు మరో ముగ్గురు దాడికి పాల్పడ్డారు. గాయపడిన సత్యనారాయణ, వెంకటేష్‌లు నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై పేర్కొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీపై కేసు

కొవ్వూరు: ఫోర్జరీ సంతకాలతో నకిలీ బిల్లులు సృష్టించి మండలంలోని ఆరికిరేవుల–3 ర్యాంపు నుంచి ఇసుక తరలిస్తున్న లారీపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపారు. బోట్‌మన్ సొసైటీ సభ్యులు, లారీల వారు కుమ్మక్కై అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మంగళవారం పట్టుకున్నామని రాజమహేంద్రవరం మైన్స్ అండ్ జియాలజీ అధికారి మన్యం సుబ్రహ్మణం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఇసుకతో ఉన్న లారీని స్వాధీనం చేసుకుని పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

అందనంత ఎత్తులో కంద

- చరిత్రలో గరిష్ట స్థాయికి చేరిన రేటు
- పుట్టు (232 కిలోలు) ధర రూ.8,000
- ఐదేళ్ల తర్వాత లాభాల్లో రైతులు
- సరాసరిన ఎకరానికి రూ.3 లక్షల మిగులు
- ఎకరానికి 60 నుంచి 80 పుట్ల దిగుబడి



అన్నవరప్పాడులో కంద దుంపలను వ్యాన్‌లో లోడ్ చేస్తున్న కూలీలు



అన్నవరప్పాడులో కంద తవ్వుతున్న కూలీలు

పెరవలి: కంద రైతుల పంట పండింది. ఐదేళ్లుగా నష్టాలు ఎదుర్కొన్న కంద రైతులు ఇప్పుడు లాభాల బాట పడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కంద పుట్టు (232 కిలోలు) ధర రూ.8,000 పలుకుతోంది. కంద చరిత్రలో ఇంత ధర లోగడ ఎప్పుడూ పలకలేదు. పది రోజుల క్రితం పుట్టు రేటు రూ.6,600 ఉండేది. ఇప్పుడు మరింత పెరగడంతో రైతుల ఆనందానికి అవధులు లేవు. మార్కెట్‌లో ఊహించని రేటు లభిస్తుండడంతో వారు భారీ లాభాలు కళ్ల జూస్తున్నారు. ఎకరం కంద చేను తవ్వితే 60 నుంచి 80 పుట్టుల దిగుబడి వస్తోంది. రైతులకు ఎకరానికి సరాసరిన రూ.మూడు లక్షల వరకూ లాభం వస్తోంది.

జిల్లాలో కందసాగు విస్తీర్ణం

జిల్లాలోని పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, కడియం మండలాల్లో దాదాపు 1,250 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు కంద పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో పుట్టు కంద రేటు రూ.1000గా ప్రారంభమైంది. ఆ రేటు క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం రూ.8,000 వద్ద స్థిరంగా ఉంది. కంద పంట చరిత్రలో ఇంత గరిష్ట ధర పలకడం ఇదే తొలిసారి.

పెట్టుబడి, ఆదాయాలు ఇలా..

కంద సాగుదారులు పుట్టు విత్తనాన్ని రూ.5 వేల రేటుకు కొనుగోలు చేశారు. ప్రస్తుత మార్కెట్‌లో లభిస్తున్న ధర ప్రకారం ఎకరానికి 60 పుట్టుల దిగుబడి వస్తే రూ.4.80 లక్షలు, 70 పుట్టుల దిగుబడి లభిస్తే రూ.5.60 లక్షల ఆదాయం వస్తుంది. ఇక ఎకరానికి 80 పుట్ల దిగుబడి వస్తే రూ.6.40 లక్షల ఆదాయం వస్తోంది. సాగు ఖర్చు ఎకరానికి సరాసరిన రూ.2.58 లక్షలు అవుతోంది. దాంతో 60 పుట్ల దిగుబడి వచ్చిన రైతులు రూ.2.22 లక్షలు, 70 పుట్ల దిగుబడి వచ్చిన వారు రూ.3.02 లక్షలు, 80 పుట్ల దిగుబడి వచ్చిన వారు రూ.3.92 లక్షల నికర ఆదాయం కనిపిస్తోంది. కాగా గతేడాది కంద ఊరికలు ఎకరానికి 70 నుంచి 80 పుట్టుల వరకూ వచ్చాయి. ధర మాత్రం రూ.4 వేలు మాత్రమే పలికింది. ఎకరం విస్తీర్ణంలో కంద వేయాలంటే విత్తనానికి రూ.1.50 లక్షలు, దుక్కుకు, విత్తనం నాటడానికి, బోదెలు తవ్వడానికి, చచ్చు ఎక్కవేయడం వంటి కూలి పనులకు 50 వేలు ఖర్చవుతుంది. దీనికి అదనంగా పెంట వేయడానికి రూ.18 వేలు, ఎరువులు, పురుగు మందులకు రూ.25 వేలు, నీటి తడులు, కలుపుతీతకు రూ.15 వేలు అవసరం అవుతుంది. ఎకరానికి మొత్తం పెట్టుబడి రూ.2.58 లక్షలు అవుతుందని రైతులు చెబుతున్నారు.

నష్టాల నుంచి లాభాల్లోకి..



కొన్నేళ్ల తర్వాత కందకు గిట్టుబాటు ధర దక్కుతోంది. దాంతో ఐదేళ్ల తర్వాత ఇప్పుడు లాభాల బాట పడుతున్నాం. పెట్టుబడి పోను ఎకరానికి సరాసరిన రూ.మూడు లక్షలు మిగులుతోంది. ఈ ఏడాది కంద సాగుకు వాతావరణం అనుకూలించింది. ప్రభుత్వం తీసుకున్న చర్యల వలన కంద రేటు స్థిరంగా ఉంది.

– వేంద్ర ఏసు, కంద రైతు, ముక్కామల, పెరవలి మండలం

ఊరికలు, ధర బాగున్నాయి



ఏటా కంద ఊరికలు బాగుంటే ధర ఉండేది కాదు. కానీ ఈ ఏడాది దిగుబడి బాగుంది. మంచి రేటు కూడా పలికింది. దీంతో ఎకరానికి రూ. లక్షల్లో మిగులు కనిపిస్తోంది. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి.

– బొలిశెట్టి వెంకటేశ్వరరావు, కంద రైతు, అన్నవరప్పాడు, పెరవలి మండలం

పెద్ద మార్కెట్లలో డిమాండ్



ఉభయ గోదావరి జిల్లాల్లో పండించిన కందకు చెన్నై, ముంబై వంటి ప్రధాన నగరాల మార్కెట్లలో డిమాండ్ ఎక్కువ. అందుకే ఈ ఏడాది ఇంత మంచి ధర పలుకుతోంది. అంతే కాకుండా అన్ని జిల్లాల్లో కంద దిగుబడి గతంలో కంటే కొంత తగ్గింది. తగినంత కంద ఉత్పత్తి లేకపోవడం కూడా కంద ధర పెరగడానికి కారణమైంది.

– గడుగొయ్యల సత్యనారాయణ, కంద వ్యాపారి

ఆగస్టు నుంచి రేషన్ షాపుల్లో సార్టెక్స్ బియ్యం

- ఇన్‌చార్జి డీఎస్ఓ విజయభాస్కర్



హాస్టల్లో బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎస్ఓ విజయభాస్కర్

గోపాలపురం: ఆగస్టు నెల నుంచి గోపాలపురం నియోజకవర్గంలోని అన్ని రేషన్ షాపులకు పోషకాలు ఎక్కువగా ఉండే సార్టెక్స్ రకం బియ్యాన్ని అందిస్తామని పౌరసరఫరాల శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి కె.విజయభాస్కర్ చెప్పారు. గోపాలపురంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలోని బియ్యం నిల్వలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి విద్యార్థినులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి సరఫరా చేసే బియ్యం నాణ్యత విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ప్రిన్సిపాల్ టి. ఉమాదేవి సివిల్ సప్లయిస్ డీటీ కె.వెంకట్ పాల్గొన్నారు.

నేడు పెరవలి మండల పరిషత్ సమావేశం

పెరవలి: పెరవలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ దామోదరరావు మంగళవారం తెలిపారు. మండలాధ్యక్షుడు కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీల అధ్యక్షులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

రాష్ట్రంలో అవినీతి రహిత పాలన

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- సంగాయగూడెంలో ప్రభుత్వ భవనాల సముదాయం ప్రారంభం



సంగాయగూడెంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. రూ.68 లక్షల వ్యయంతో మండలంలోని సంగాయగూడెంలో నిర్మించిన గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్ర, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను మంగళవారం ఎమ్మెల్యే తలారి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), సర్పంచ్ కరుటూరి ఉషారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ నియోజవర్గంలోని 82 గ్రామ సచివాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేశామన్నారు. గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్న కలలను సీఎం జగన్ నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యురాలు సుంకవల్లి చిన్న వెంకట నాగదుర్గ, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి జి. రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కూచిపూడి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఏవో కె. విజయ్ పాల్గొన్నారు.

మార్పులు, చేర్పులకు సహకరించండి

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో మల్లిబాబు
- 21 నుంచి ఇంటింటికీ వచ్చి ఓటర్ల నమోదు



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కొవ్వూరు: ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సహకరిస్తే పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారుకు ఆస్కారం ఉంటుందని ఆర్డీవో ఎస్.మల్లిబాబు పేర్కొన్నారు. 2023–24 ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో కార్యాలయంలో సమీక్ష జరిపారు. సహాయ ఓటర్ల నమోదు అధికారులు వ్యక్తిగత పరిశీలన చేసేలా బీఎల్‌వోలను ఆదేశించామన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో డోర్ నంబర్ తేడాలు, ఫొటోలు సరిచేయడం వంటివి, ఎనభై, వంద ఏళ్లు దాటిన వారి పేర్లు, పుట్టిన తేదీల మార్పులు కలిపి 6,434 మంది ఉన్నట్టు గుర్తించామని ఆర్డీవో చెప్పారు. ఈ నెల 21 నుంచి బీఎల్‌వోలు ఇంటింటా సర్వే నిర్వహిస్తారన్నారు. ఆ సమయంలో రాజకీయ పార్టీల తరపున ఆయా పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ప్రతి మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై, సర్వేలోని లోటుపాట్లను సరి చేయిస్తాయన్నారు.

మూడు నెలలకొకసారి నమోదు

గతంలో డిసెంబర్‌లో ఓటరు నమోదు ఉండేదని, ఇప్పుడు ఎన్నికల కమిషన్ ప్రతి మూడు నెలలకొకసారి నమోదుకు అవకాశం కల్పించిందని ఆర్డీవో మల్లిబాబు చెప్పారు. జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారి ఓట్లను సైతం నమోదు చేయవచ్చన్నారు. బూత్ లెవెల్ అధికారులు ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకూ ఇంటింటికీ వచ్చి వివరాలు నమోదు చేసుకుంటారన్నారు. నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, సహాయ అధికారులు పర్యవేక్షణ బాధ్యత వహిస్తారని చెప్పారు. ఓటర్ల నమోదుకు వస్తున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పోర్టల్‌లో నవీకరించనున్నట్టు ఆర్డీవో తెలిపారు. ఏదైనా పోలింగ్ కేంద్రంలో 1500కి పైబడి ఓటర్లు ఉంటే మరో పోలింగ్ కేంద్రంలో విలీనం చేయడం, లేదంటే కొత్త పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధి జె.విజయమోహన్‌కుమార్, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బ రాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు బీవీ ముత్యాలరావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎ.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్ జిల్లా సభ్యుడిగా 'మద్దూరి'

నల్లజర్ల: ట్రేడ్ యూనియన్ జిల్లా సభ్యుడిగా వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దూరి నాగేశ్వరరావు నియమితులయ్యారు. గత 30 ఏళ్లుగా మండలంలో భవన నిర్మాణ కార్మికులను సంఘటితంగా నడిపిస్తున్న ఆయనకు ఈ పదవి రావడంపై గ్రామపెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ గ్రామ సచివాలయంలో నాగేశ్వరరావును శాలువాతో సత్కరించారు. వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీరావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు అచ్యుత వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు మృతులకు నివాళి

నిడదవోలు రూరల్: ప్రకాశం జిల్లా కారంచేడు గ్రామంలోని దళితవాడపై 38 ఏళ్ల క్రితం ఆ గ్రామ పెత్తందార్లు జరిపిన దాడిలో మృతి చెందిన వారికి కులనిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని సమిశ్రగూడెం అరుంధతీయపేటలో కేఎన్‌పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు.కేఎన్‌పీఎస్ నాయకులు ఎం.కుమార్, శరత్‌బాబు, సతీష్, లెనిన్, శశి, సురేష్, మహేష్, సిర్రా విజయ్‌లు పాల్గొన్నారు.

25న కొవ్వూరులో మెగా జాబ్‌మేళా



మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హోం మంత్రి వనిత, నాయకులు

కొవ్వూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ జాబ్ మేళాకు వివిధ ప్రాంతాలకు చెందిన 32 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. మెగా జాబ్ మేళా పోస్టర్‌ను మంత్రి వనిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

గోపాలపురం: బంగారుకొండ కార్యక్రమంలో భాగంగా గోపాలపురం బీసీ కాలనీలోని చిన్నారులకు మంగళవారం 104 ఫ్యామిలీ డాక్టర్ ఎస్.నవీన్‌కుమార్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. ప్రతి వారం ఒక అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ నవీన్‌కుమార్ చెప్పారు.

వలంటీర్లకు వందనం

ఆపన్నులను ఆదుకోవడంలో మిన్న



వీరమ్మకు నిత్యావసరాలు అందిస్తున్న వలంటీర్ తాడేపల్లి సుబ్బలక్ష్మి

ఆపన్నులను ఆదుకోవడంలో మండలంలోని పెద్దగూడేనికి చెందిన వలంటీర్ తాడేపల్లి సుబ్బలక్ష్మి ఎప్పుడూ ముందు వరసలో ఉంటుంది. కరోనా సమయంలో నిరాశ్రయులకు ఆమె అందించిన సేవలు ఎనలేనివి. కోవిడ్ విపత్తు సమయంలో అక్కాబత్తుల వీరమ్మ అనే వృద్ధురాలు మూడు రోజుల పాటు ఒంటరిగా ఇంట్లోనే ఉండిపోయింది. వండుకోవడానికి ఇంట్లో ఏమీ లేవు. విషయం తెలుసుకున్న వలంటీర్ తాడేపల్లి సుబ్బలక్ష్మి ఆమె ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులతో పాటు గ్యాస్ సిలిండర్ కూడా ఏర్పాటు చేసింది.అక్కడితో ఊరుకోలేదు. వీరమ్మ చేత వైఎస్సార్ పింఛనుకు దరఖాస్తు చేయించింది. అధికారులతో మాట్లాడి పింఛను వచ్చేలా చేసింది. కడుపున పుట్టిన బిడ్డలే తల్లిదండ్రులను పట్టించుకోలేని కరోనా కష్టకాలంలో ఒక్క అక్కాబత్తుల వీరమ్మకే కాదు ఎందరికీ అండగా నిలిచి మన్ననలు అందుకుంది సుబ్బలక్ష్మి. – గోపాలపురం

నా ఊపిరి నిలిపింది



నాకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నేను ఒంటరిగా ఉంటున్నాను. కరోనా కష్ట కాలంలో వారు నన్ను చూడడానికి కూడా రాలేదు. కడుపున పుట్టిన కూతురి కన్న మిన్నగా పెద్దగూడెం సచివాలయం–3 వలంటీర్ సుబ్బలక్ష్మి నన్ను ఎక్కువగా ఆదరించి సేవలు అందించింది. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛను, రేషన్ బియ్యం అందించి నా ఊపిరి నిలుపుతోంది. వలంటీర్ సుబ్బలక్ష్మి రుణం తీర్చుకోలేను.

– అక్కాబత్తుల వీరమ్మ, పెద్దగూడెం, గోపాలపురం

సురక్షతో ఉచితంగా ధ్రువపత్రాలు



నల్లజర్ల మండలం కవులూరులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- అవకాశాన్ని వినియోగించుకోండి
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచన
- పలు ప్రాంతాల్లో ధ్రువ పత్రాల పంపిణీ

దేవరపల్లి: 'జగనన్న సురక్ష' ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రజలకు సూచించారు. మండలంలోని సంగాయగూడెంలో సర్పంచ్ కరుటూరి ఉషారాణి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సురక్ష గ్రామసభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇప్పటి వరకూ 45 గ్రామ సచివాలయాల వద్ద గ్రామసభలు నిర్వహించగా, 40 వేల అర్జీలు వచ్చాయన్నారు. వాటిలో అర్హులని తేలిన 32 వేల మందికి ఉచితంగా ధ్రువ పత్రాలు అందజేశామన్నారు. సంగాయగూడెంలో రైతులకు 397 1బి అడంగళ్, 118 మందికి ఆదాయ, 118 మందికి కుల ధ్రువపత్రాలు, ఏడుగురికి రేషన్ కార్డులు, రైతులకు కౌలుదారీ కార్డులు, ఇతర ధ్రువపత్రాలు 264, మొత్తం 912 మందికి కార్డులు మంజూరయ్యారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావుల చేతుల మీదుగా వాటిని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు గారపాటి రమాప్రభ, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని కవులూరు గ్రామంలో సర్పంచ్ మద్దిపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా 390 కుల, 359 ఆదాయ, 150 1–బిలు, రెండు రేషన్ కార్డులు అందించారు. ఆధార్ లింకేజ్ 11, రేషన్ కార్డులలో మార్పులు 13 చేశారు. అలాగే జనన, మరణ, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీడీఓ రాజశేఖరం పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని కొవ్వూరుపాడు సచివాలయం వద్ద నిర్వహించిన సురక్ష గ్రామసభలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా 30 మంది రైతులకు కౌలుదారీ కార్డులు, 12 మందికి కొత్త రేషన్, ఓటరు గుర్తింపు కార్డులు అందజేశారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ చిలకా లక్ష్మణస్వామి, ఎంపీటీసీ సభ్యుడు కె.సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల, కోరుమామిడి సచివాలయాల పరిధిలో సర్పంచులు బయ్యే రాధారాణి, అంబటి గోపమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.ఎంపీటీసీ సభ్యులు కొప్పుల నాగేశ్వరరావు, వరిగేటి సౌజన్య, సొసైటీ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, తహసీల్దార్ ఎం.గంగరాజు, ఎంపీడీఓ పి.శామ్యేలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త, కాల్దారి గ్రామాల్లో ఎంపీడీవో జి.రామకృష్ణంరాజు, తహసీల్దార్ జి.కనకరాజు ఆధ్వర్యంలో సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ఎంపీపీ పొలాటి యల్లారేశ్వరి చేతుల మీదుగా కాల్దారిలో కులధ్రువీకరణ పత్రాలు 591, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 589, అండంగల్ పత్రాలు (వన్ –బి) 365, బియ్యం కార్డులు 3, ఇతర సేవలతో కలిపి మొత్తం 1776 మంది లబ్ధిదారులకు అందజేశారు. సొసైటీ అధ్యక్షులు ఆలపాటి నరేంద్ర, అబ్బిన రాంబాబు, సర్పంచ్ చిటికెన సుజని, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, చిటికెన సూర్యనారాయణ, గుణ్ణం రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు జానీ నాగలక్ష్మి, వి.రాణి పాల్గొన్నారు.

పెరవలి: ముక్కామల, లంకమాలపల్లి గ్రామాల్లో సురక్ష సభలు నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ లంకమాలపల్లిలో 954, ముక్కామలలో 1415 అర్జీలు వచ్చాయి. పరిశీలన అనంతరరం ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ చేతుల మీదుగా వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపీడీఓ దామోదరరావు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, ముక్కామల సర్పంచ్ కేతా త్రిమూర్తులు ఎంపీటీసీ బొకే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొవ్వూరు(తాళ్లపూడి): తాళ్లపూడి మండలం మలకపల్లిలో నిర్వహించిన జగనన్న సురక్ష సభలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ చేతుల మీదుగా గ్రామంలోని 1,400 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్ పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు–3,–4 గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించిన సురక్ష సభలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీడీవో బి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో చాగల్లు–3 సచివాలయంలో 680 మందికి, చాగల్లు–4 సచివాలయంలో 850 మందికి ఇంటి స్థలాల పట్టాలు, ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు అందజేశారు. సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఎంపీటీసీ సభ్యురాలు ఉన్నమట్ల విజయకుమారి, మేకా రాజు పాల్గొన్నారు.